సాక్షి
బాపట్ల
మంగళవారం ǀ 12 ǀ నవంబర్ ǀ 2024




ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి దేవస్థానం పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన వీజయకుమార్, లక్ష్మీమాధురి దంపతులు రూ.1,01,116 అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ కృష్ణానదీ పరివాహక ప్రాంతాల నుంచి 290 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 6000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

పరమ శివుడిని తాకిన సూర్య కిరణాలు



వేటపాలెం: నాయినపల్లిలోని గంగాభవానీ సమేత భోగలింగేశ్వరస్వామి దేవస్థానంలో పరమ శివుడ్ని కార్తిక సోమవారం ఉదయాన భానుడి కిరణాలు అభిషేకించాయి. శివుడికి ప్రీతిపాత్రమైన కార్తిక సోమవారం రోజు శివలింగాన్ని సూర్య కిరణాలు తాకడాన్ని భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కారంచేటి చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది దక్షిణాయనం కార్తిక మాసంలో సూర్య కిరణాలు శివలింగాన్ని తాకుతాయని తెలిపారు. ఆలయానికి విశిష్టత ఉందని, 11వ శతాబ్దంలో చోళ రాజులు నిర్మించారని చెప్పారు. శివాలయాన్ని అప్పటిలో ఆదిశంకరాచార్యులు కూడా సందర్శించారని వెల్లడించారు. బ్రహ్మసూత్రం కలిగిన గొప్ప శివాలయంగా కూడా పేరు పొందిందని వివరించారు. జిల్లాలో బ్రహ్మ సూత్రం కలిగిన ఆలయం ఇది ఒక్కటేనని వివరించారు. ఆలయంలో రెండు నందులు ఉండటం విశేషమన్నారు. ఒకటి స్థిర నంది, మరొకటి చర నందిగా పిలుస్తారని తెలిపారు. స్త్రీలు ప్రసవ సమయంలో ఇబ్బందులు కలిగినప్పుడు చర నందినిని తిరోగమనంలోకి తిప్పితే సుఖ ప్రసవం జరుగుతుందని పూర్వీకులు చెప్పేవారని ఆయన వివరించారు.

పెళ్లి కుమారుడైన పాండురంగస్వామి



అమరావతి: ప్రఖ్యాత శైవక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీరుక్మాబాయి సమేత పాండురంగస్వామి దేవాలయంలో పాంచాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారిని పెండ్లికుమారుని చేసి అర్చకులు ధ్వజారోహణ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరాశరం రామకృష్ణమాచార్యులు ఉత్సవాల గురించి వివరించారు. మంగళవారం చిన్న శేషవాహనం, బుధవారం ఉదయం దధిమధనోత్సవం, గోపాల బాలోత్సవం, గురువారం అశ్వవాహనంపై కల్యాణమూర్తులకు ఎదుర్కోలు మహోత్సవం అనంతరం రుక్మాబాయికి పాండురంగస్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. శుక్రవారం కార్తిక పౌర్ణమి రోజున స్వామివారికి లక్ష తులసీపూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. శనివారం వసంతోత్సవం, చూర్ణోత్సవం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు


గుంటూరు ఎడ్యుకేషన్: వావిలాల గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు (సీఎల్ఐఎస్సీ) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ దోనె రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసి, 18 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు కోర్సులో చేరేందుకు అర్హులని, ఐదు నెలల కాల వ్యవధిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుందని తెలిపారు. వివరాలకు 93962 38946 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

● బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కు మొండిచేయి

పైసా విదల్చని సర్కార్


- అభివృద్ధి పథకాలదీ అదేదారి
- హామీ ఇచ్చిన పథకాలు గాలికి
- ప్రకటించినా నిధులివ్వని సర్కార్
- కొన్ని పథకాలకు మొక్కుబడి నిధులు
- అన్నదాత సుఖీభవకు నామమాత్రపు నిధులు
- ఊసే లేని ఉచిత బస్సు ప్రయాణం హామీ
- ఒక్క సిలిండర్‌కు నిధులు కేటాయించని వైనం
- సాగునీటి పథకాలకు పైసా విదల్చని ప్రభుత్వం
- తాజా బడ్జెట్‌పై సర్వత్రా విమర్శలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల తర్వాత సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అస్తవ్యస్తంగా ఉంది. నియోజకవర్గానికి మొండిచేయి చూపింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాల సంగతి దేవుడెరుగు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొలువుదీరిన తర్వాత ప్రకటించిన నామమాత్రపు పథకాలకు సైతం ప్రభుత్వం పైసా విదల్చలేదు. బడ్జెట్ కేటాయింపులపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, బాపట్ల : సంక్షేమ పథకాలతోపాటు జిల్లాకు నిధులు కేటాయించి పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం చిల్లిగవ్వ కేటాయించలేదు. ఎన్నికల సమయంలో అధికారంకోసం కుప్పలు తెప్పలుగా హామీలు ఇచ్చిన కూటమి అధికారంలోకి వచ్చాక ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా మారింది. నియోజకవర్గానికి తీరని అన్యాయం చేసింది.

రైతుకు భరోసా కరువు



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని తామూ కొనసాగిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు చెప్పారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని గొప్పగా చెప్పారు. గద్దెనెక్కాక దాని ఊసే మరిచారు. ఖరీఫ్ వెళ్లి రబీ వచ్చినా జిల్లాలోని 1,92,037 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ. 384.06 కోట్లలో పైసా ఇవ్వలేదు. ఇప్పుడు కేంద్రం ఇచ్చే రూ. 6 వేలతో కలిపి రూ. 20 వేలు ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఈ పథకానికి రూ. 10 వేల కోట్లు అవసరం కాగా తాజా బడ్జెట్‌లో కేంద్రం ఇచ్చే మొత్తంతో కలిపి కేవలం రూ. 4,500 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో ఈ పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది.

అంతా గ్యాసే..



ఆడబిడ్డలు వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అందరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు గట్టిగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకు మొక్కుబడిగా కొందరికే అంటూ కోతలు పెట్టారు. తాజా బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చూస్తే మూడు కాదు కదా ఒక్క సిలిండర్ కూడా ఇచ్చే పరిస్థితి కనిపించడంలేదు.

తల్లికి వంచన

తల్లికి వందన పేరుతో ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామన్నారు. ఇంట్లో ఎంతమంది ఉన్నా ఇస్తామన్నారు. ఇప్పటికీ దాని ఊసేలేదు. జిల్లాలోని 2,35,654 మందికి రూ. 353.48 కోట్లు ఇవ్వాల్సిఉన్నా ఒక్క రూపాయి అందించలేదు. తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

భృతి..భ్రాంతి

నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని గొప్పగా చెప్పారు. జిల్లాలో 4,77,557 కుటుంబాలు ఉన్నాయి. ఇంటికొక్కరు అనుకున్నా వారందరికీ చెల్లించాల్సిన రూ. 143.26 కోట్లలో పైసా ఇవ్వలేదు. బడ్జెట్‌లో ఇందుకోసం రూపాయి కూడా కేటాయించలేదు.

మహిళలకు సాయం ఊసే లేదు

19 సంవత్సరాలనుంచి 59 ఏళ్ల వయస్సులోపు మహిళలకు ప్రతినెలా రూ. 1500 ఇస్తామన్నారు. జిల్లాలో 19 నుంచి 59 ఏళ్ల వయస్సు వారు 6,61,841 మంది ఉన్నారు. వీరందకి ఏడాదికి రూ. 11,913 కోట్లు ఇవ్వాల్సిఉన్నా దాని ఊసే మరిచారు. ఇప్పుడు బడ్జెట్‌లో ఈ పథకం పేరెత్తలేదు.

ఉచిత బస్సు తుస్సు



మహిళలందరికీ ఉచితబస్సు ప్రయాణమని ఎన్నికల సమయంలో గొంతెత్తి అరిచిన చంద్రబాబు గద్దెనెక్కాక హామీని గాలికొదిలారు. జిల్లాలో ఉన్న ఆర్టీసీ బస్సుల ప్రకారం రోజూ 90 వేలమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు. తాజా బడ్జెట్‌లో ఆ పథకం పేరు కూడా ప్రభుత్వం ఉచ్చరించలేదు.

కొండెక్కిన పర్యాటకాభివృద్ధి

జిల్లాలో తీరప్రాంతం ఉన్నందున పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కేంద్రం రూ. 100 కోట్లు ప్రకటించిందన్నారు. తీర ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మారుస్తామని కూడా కూటమి సర్కార్ చెప్పింది. బడ్జెట్‌లో మాత్రం జిల్లాలో పర్యాటకాభివృద్ధికి నిధులు లేవు.

చానల్ ఆధునికీరణ ఏదీ?

బాపట్ల జిల్లా వ్యవసాయానికి ప్రసిద్ధి. కృష్ణా డెల్టా కింద జిల్లాలోనే 3. 80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అధికారంలోకి రాగానే గుంటూరు చానల్ ఆధునికీరిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆధునికీకరణకు రూ. 380 కోట్లు అవసరమవుతుందని అధికారులు అంచనాలు పంపారు. బడ్జెట్‌లో ప్రభుత్వం మొత్తం కృష్ణా డెల్టాకు కేవలం రూ. 138.76 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో ఆధునికీకరణ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు.

కరకట్ట భద్రత ఊసేలేదు

మరో వైపు కృష్ణా కరకట్ట చాలా చోట్ల దెబ్బతింది. ఇటీవల వరదలకు కట్టకు గండిపడి 24 లంక గ్రామాలు నీట మునగాయి. వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో పెద్దఎత్తున నీరు చేరి వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. తాము అధికారంలోకి రాగానే కరకట్టను ఆధునికీరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పైసా నిధులు కేటాయించలేదు.

కేజీబీవీలో డిప్యూటీ డీఈఓ విచారణ

చీరాల అర్బన్: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం చీరాల డివిజన్ డిప్యూటీ డీఈఓ అబ్బరాజు శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం విద్యార్థినులకు అల్పాహారం అందించకపోవడంపై పత్రికలలో వచ్చిన కథనాల మేరకు సోమవారం పాఠశాల విద్య ఆర్జేడీ ఆదేశాల మేరకు ఆయన పరిశీలన చేశారు. కేజీబీవీలో ఎస్ఓ, వంట చేసేవారితో మాట్లాడి వివరాలను నమోదు చేశారు. విద్యార్థులకు సరిపడా సిలిండర్లు అందుబాటులో ఉంచకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల పట్ల ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటామన్నారు. నమోదు చేసిన వివరాల రిపోర్టును ఆర్జేడీకి అందిస్తామన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన



రాజుపాలెం: ఇళ్లమధ్య ఉన్న మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని మహిళలు ఆందోళన చేశారు. మండలంలోని కొత్త బోధనం (చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసితుల కేంద్రం) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్దకు సోమవారం గ్రామ మహిళలు చేరుకుని పెత్త ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ మద్యం బాబులు ఇక్కడే తాగి మా ఇళ్లముందే వీరంగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట రాజుపాలెం గ్రామంలో దుకాణం పెట్టారని, అక్కడివారు అడ్డగించడంతో తీసివేసి కొత్త బోధనంలో ఏర్పాటు చేశారని మహిళలు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ షాపు తొలగించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పీజీఆర్ఎస్) అందే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పైగా బాధితులు సమస్యలు పరిష్కరించండి అంటూ అర్జీల ద్వారా కలెక్టర్‌ను వేడుకున్నారు. అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలని కలెక్టర్ అధికారుల్ని ఆదేశించారు. కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం మంచి పద్ధతి కాదని సూచించారు. అన్ని మండలాలలో ల్యాండ్ బ్యాంక్, ఖాళీ భూముల వివరాలు ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించారు. భూముల వివరాలను ఆర్డీవోలు, తహసీల్దార్లు విచారించాలని ఆయన సూచించారు.

ఉచితంగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ఏపీ విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా గ్రాడ్యుయేషన్ దివ్యాంగులకు ల్యాప్ టాప్‌లను జిల్లా కలెక్టర్ ఉచితంగా అందజేశారు. 'ఏపీడిఎఎస్‌సిఏసి.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకున్న ఐటీఐ, పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులందరికీ ప్రభుత్వం ఉచితంగా ల్యాప్ టాప్‌లు అందజేస్తోందని తెలిపారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఆరుగురు దరఖాస్తు చేసుకోగా రూ.35 వేలు విలువచేసే ల్యాప్‌టాప్‌లు మంజూరు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, రామచంద్రయ్య పాల్గొన్నారు. అనంతరం వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి బీసీ సంక్షేమ శాఖ వసతి గృహానికి ఆరు ఫ్యాన్లను దాతలు విరాళంగా ఇవ్వగా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఇంచార్జ్ బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేష్ దాసు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి. గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్



ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

మహనీయుల స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలి

మహనీయుల స్ఫూర్తి, సోదరభావంతో ప్రతి ఒక్కరూ ఐక్యంగా దేశాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి వేడుకలు మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ వెంకట మురళి, సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కలామ్ వంట మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తు నిర్మాణం కోసం యువత చక్కని ప్రణాళిక రచించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం నిలిచిందని, దాన్ని మూడో స్థానానికి తీసుకెళ్లడానికి కేంద్ర పాలకులు కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా దేశాభివృద్ధికి ఐక్యంగా మన వంతు కృషి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని విశేషంగా కృషిచేసిన మహనీయులు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. పురుషోత్తం కొనియాడారు. అందరికీ సమానంగా విద్య అందించాలని, అప్పుడే దేశం పురోభివృద్ధిలో పయనిస్తుందని గుర్తించిన గొప్ప మేధావిగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి. గ్లోరియా, ముస్లిం పెద్దలు అలీఫుల్లా ఖాన్, అబ్దుల్ రషీద్, వివిధ శాఖల అధికారులు, మైనార్టీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉండరాదు: జేసీ ప్రఖర్ జైన్

అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని తహసీల్దార్లను జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా చిత్తశుద్ధితో పరిష్కరించాలని, నిర్లిప్తత ఉండరాదని తెలిపారు. గడువు తీరినప్పటికీ పెండింగ్‌లో ఉంటే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నీటి తీరువా పన్నులు వసూలు చేసే బాధ్యత తహసీల్దార్లపై ఉందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో వసూలు చేయకపోవడంపై ఆరా తీశారు. నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం

అండర్-14 బాలబాలికల జట్ల ఎంపిక

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు గెలుపొంది విజేతలుగా నిలిచారు. గత మూడు రోజులుగా జరుగుతున్న పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలుర విభాగంలో 13 టీమ్‌లు, బాలికల విభాగంలో 13 టీమ్‌లు పాల్గొన్నారు. లీక్, నాకవుట్ పద్ధతిలో పోటీలు జరిగాయి. ఫైనల్‌లో బాలుర విభాగంలో శ్రీకాకుళం టీమ్‌తో విజయనగరం తలపడింది. శ్రీకాకుళం విజేతగా నిలవగా విజయనగరం టీమ్ రన్నర్స్‌గా నిలిచింది. గుంటూరు బాలుర టీమ్ తృతీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో శ్రీకాకుళం టీమ్, అనంతపురం టీమ్‌లు పోటీపడగా శ్రీకాకుళం విజేతగా నిలిచింది. అనంతపురం రన్నర్స్‌గా, గుంటూరు టీమ్ తృతీయస్థానం సాధించింది. కబాడీ పోటీల ముగింపు కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్-14 రాష్ట్ర జట్టుకు బాలురు 12మంది, బాలికలు 12 మందిని ఎంపిక చేసినట్లు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా కార్యదర్శి షేక్ కరీముల్లా తెలిపారు. వీరంతా త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేర్ విద్యా సంస్థల ప్రతినిధులు వేగేశన రాధాకృష్ణంరాజు, కిషోర్‌రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజర్ ప్రశాంత్‌బాబు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బాలికల టీమ్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



బాలుర టీమ్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

కోలాహలంగా సూర్యలంక తీరం



తీరం ఒడ్డున సామూహిక గౌరీదేవి పూజలు

పోటెత్తిన భక్తులు

బాపట్ల టౌన్: కార్తిక పౌర్ణమికి ముందు సోమవారం కావడంతో సూర్యలంక తీరానికి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, బస్సుల ద్వారా తరలివచ్చారు. సాగరంలో సూర్య నమస్కారాలతో స్నానాలాచరించారు. అనంతరంతీరం వెంబడి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇసుకతో గౌరీదేవి ప్రతిమ, శివలింగాలను తయారు చేశారు. వాటి ముందు ముగ్గులేసి మధ్యలో గొబ్బెమ్మలను ఏర్పాటుచేశారు. శివలింగానికి పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలనంతరం గౌరీదేవి ప్రతిమలతోపాటు గంగమ్మకు ఇష్టమైన పూలు, పండ్లను సముద్రంలో కలిపి పుణ్యస్నానాలాచరించారు. అనంతరం తీరం వెంట ఉన్న ఆంజనేయస్వామి, త్రికోటేశ్వరస్వామి దేవాలయాల వద్ద పూజలు నిర్వహించారు. తీరానికి వచ్చిన భక్తులు, పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా రూరల్ సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఎప్పటికప్పుడు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. మండలంలోని నాగేంద్రపురంలో గల నాగేంద్రస్వామి దేవాలయంలోని ఉసిరిచెట్టు వద్ద మహిళలు అధిక సంఖ్యలో పూజలు చేశారు.



సూర్యలంక తీరంలో సూర్య నమస్కారాలు చేస్తున్న మహిళలు





భక్తిశ్రద్ధలతో సాగర హారతి

కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా రాత్రి మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సాగర హారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తీరం ఒడ్డున శివునికి ప్రత్యేక పూజల అనంతరం శాస్త్రోక్తంగా సాగర హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు డాక్టర్ తాడివలస దేవరాజ్, బండారు జ్వాల మాట్లాడుతూ ఈనెల 15న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని హైందవ శంఖారావం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా సామూహికంగా సాగర హారతి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటిసారిగా వాడరేవులో నిర్వహిస్తున్న సాగర హారతికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వహకులు కోరారు. కార్యక్రమంలో అర్చకులు కారంచేటి నగేష్‌కుమార్, వెంకటేష్, గోపి, రఘు పాల్గొన్నారు. - చీరాల టౌన్

మొరలు వినండీ.. మహాప్రభో !

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వాపోయిన బాధితులు
- విచారించి న్యాయం చేస్తానన్న ఎస్పీ తుషార్ డూడీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సమస్యలు వెల్లువెత్తాయి. జిల్లా నలు మూలల నుంచి సోమవారం 37 మంది ఎస్పీని కలిసి సమస్యల్ని విన్నవించుకున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని బాధితులు ఆయన ముందు వాపోయారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది పట్టించుకోవడం లేదని విన్నవించుకున్నారు. బాధితుల సమస్యల్ని క్షుణ్ణంగా తెలుసుకున్న ఎస్పీ తుషార్‌డూడీ సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడి, పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

కడతేర్చాలని చూస్తున్న కన్న కొడుకు



నాది జె. పంగులూరు మండలంలోని కోటపాడు గ్రామం. వయస్సు 70 సంవత్సరాలు. భర్త లేరు. ఇద్దరు కొడుకులు. ఇందులో పెద్ద కుమారుడు చనిపోయాడు. ప్రస్తుతం ఉన్న చిన్న కుమారుడు, అతని భార్య నన్ను చంపి నా పేరుతో ఉన్న 35 సెంట్ల స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారు. వారి వేధింపులు భరించలేక నాలుగు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. నా కొడుకు...కోడలు బారి నుంచి నన్ను కాపాడాలి.

– బత్తుల శేషమ్మ

భార్య వేధింపులు భరించలేకపోతున్నా..

చీరాలలోని విఠల్‌నగర్‌కు చెందిన నాకు 10 సంవత్సరాల క్రితం షేక్ అఫ్రీన్‌తో వివాహం అయ్యింది. మాకు ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం. నా భార్య వేరే వ్యక్తితో కలిసి ఐదు నెలలుగా సహజీవనం చేస్తూ ఒంగోలులో ఉంటోంది. నా తల్లి 80 సంవత్సరాల వృద్ధురాలు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని, చిన్నపిల్లలను చూసుకోవడం చాలా కష్టంగా ఉందని ప్రాధేయపడుతున్నా పట్టించుకోవడం లేదు. నేను కావాలో...నీ తల్లి కావాలో తేల్చుకోమంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతోంది. పిల్లలు తల్లి కావాలని నిత్యం గొడవ చేస్తున్నారు. ఈ విషయాన్ని చీరాల పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు.

– షేక్ మస్తాన్‌వలి, చీరాల

చంపుతామని బెదిరింపులు

పట్టణంలోని నరాలశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన నరాలశెట్టి తులసీరామ్ మూడు సంవత్సరాల కిందట రూ. 1.65 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు ఇవ్వమని అడుగుతుంటే నన్ను చంపుతానని బెదిరిస్తున్నాడు. అతని వల్ల నాకు ప్రాణహాని ఉంది. అతని చెర నుంచి కాపాడాలి.

– సుదా వెంకటేశ్వరమ్మ, నరాలశెట్టిపాలెం

వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం

మాది బాపట్ల మండలంలోని కొండుబోట్లవారిపాలెం. మా తల్లి శీలం సుబ్బరావమ్మ గత 30 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న ఇల్లు, స్థలం కబ్జా చేయాలనే ఉద్దేశంతో ఆమె తమ్ముళ్లు నిత్యం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. వారి వేధింపులు భరించలేక రెండురోజుల కిందట మా అమ్మ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రస్తుతం బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. తమ్ముళ్లు, మరదల చెర నుంచి మా అమ్మను కాపాడాలి.

– తిరుమలశెట్టి స్రవంతి

ఆటోను ఇప్పించాలి

జెజ పంగులూరు మండలం కొండముంజులూరు గ్రామానికి చెందిన నా ఆటోను నక్కబుక్కలపాడు గ్రామానికి చెందిన ఆల్లకుంట్ల శ్రీనుబాబు ఆగస్టు 16న ఇంట్లోలేని సమయంలో తీసుకెళ్లాడు. దీనిపై అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశా. నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేదు. కేసు గురించి పోలీసులు పట్టించుకోవడం లేదు.

– పల్లపు సుబ్బరాయుడు

తాగుబోతుల వేధింపులు

నేను కర్లపాలెం మండలం, మార్పుచెన్నయ్‌పాలెం గ్రామానికి చెందిన వృద్ధుడిని. పాస్టర్‌గా పని చేస్తుంటా. నిత్యం నేను చర్చికి వెళ్లే దారిలోని యారంవారిపాలెం గ్రామానికి చెందిన జోగి చిన్నవందనం, మార్పు మార్క్‌లు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలంటూ నన్ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నా దగ్గర లేవని చెబుతున్నా చంపుతామని బెదిరిస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించాలి.

– పి. ప్రభుదాస్

క్లుప్తంగా

క్రికెట్ జట్టుకు పెదగంజాం విద్యార్థుల ఎంపిక



చినగంజాం: ప్రకాశం జిల్లా పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా అండర్–17 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. ఆసోది బాలాజీరెడ్డిని జట్టులోకి తీసుకోగా, మరో విద్యార్థి మాతవరపు అభిరామ్ అదనపు ఆటగాడిగా ఎంపికయ్యారు. పాఠశాలలో సోమవారం విద్యార్థులతో పాటు పీడీ ఎం. అనీల్ కుమార్‌ను హెచ్‌ఎం దేవదత్తం, ఇన్‌చార్జ్ డి. నారాయణరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఏ. సుదర్శనరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ఏ. వీరాచారి, బి. చెంచిరెడ్డి, కె. నాగరాజు, ఎస్. శ్రీరమణ అభినందించారు.

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి



బల్లికురవ: రబీలో పొగాకు స్థానంలో ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, అపరాలు, చిరుధాన్యాలు సాగుతో అధిక దిగుబడులతో ఆదాయం పొందవచ్చని బాపట్ల జిల్లా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి వెల్లడించారు. సోమవారం మండలంలోని వేమవరంరైతు సేవాకేంద్రాలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. పొగాకు సాగుతో రైతులు అనారోగ్యం బారిన పడటంతో పాటు కూలీలు దొరక్క పెట్టుబడి వ్యయం పెరుగుతుందని తెలిపారు. మొక్కజొన్న ఈ ప్రాంతానికి అనుకూలమైన పంటని సూచించారు. మొవ్వ, కత్తెర పురుగు సోకకుండా జాగ్రత్తలు వహిస్తే అధిక దిగుబడులతో నికర ఆదాయం పొందవచ్చని చెప్పారు. మొక్కజొన్నలో కలుపు నివారణ, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. సదస్సులో వ్యవసాయశాఖ మార్టూరు ఏడీఏ కె.వి. శ్రీనివాసరావు, బాపట్ల ఏరువాక శాస్త్రవేత్త ఉష, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి, వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.దేవదత్తు

బాపట్లటౌన్: బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. దేవదత్తు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 42 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 102 లీటర్ల అనధికార మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాటుసారా తయారుచేసే 40 మందిపై కేసులు నమోదుచేసి వారి వద్ద నుంచి 6500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా తయారుచేస్తున్నట్లు సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

17న మాస్టర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

బాపట్ల టౌన్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 17న మాస్టర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ షేక్ నజీర్ సోమవారం తెలిపారు. 30 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు ఫొటోస్టాట్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకురావాలని ఆయన సూచించారు. ఎంపికైన వారంతా డిసెంబర్‌లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారని తెలిపారు.

జేఎన్‌టీయూ జూడో జట్ల ఎంపిక



పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో సోమవారం జరిగిన జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల జూడో టోర్నమెంట్‌లో విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేశారు. జేఎన్‌టీయూ జూడో పురుషుల విభాగానికి సంబంధించి నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీహెచ్ కొర్నేలిబాబు, కె.డివైన్స్, పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.నాగరాజు, ఎస్ఆర్ఐ కళాశాలకు చెందిన ఆర్.అజయ్, ఒ.వంశీసాగర్, తిరుమల ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.అభిజిత్ ఎంపికయ్యారు. మహిళల విభాగంలో ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.రాణి, డి.ఝాన్సీ, పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీహెచ్ కీర్తి, కె.అలేఖ్య తదితరులు ఎంపికయ్యారు.

పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



సమావేశంలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

బాపట్లటౌన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీపీఐ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఎన్నికల అనంతరం ప్రకటించిన విధంగా పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున నివేశన స్థలాలు కేటాయించాలన్నారు. జిల్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించటానికి అనువైన ప్రాంతాలను గుర్తించి లే–అవుట్లు వేయాలన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు సిమెంటు, ఇసుక, ఇటుక, కంకర తదితర సామగ్రి ధరలు పెరిగిన రీత్యా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా పేదల ఇళ్ల స్థలాల సాధన కోసం కార్యరూపం చేపట్టిందన్నారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. నివేశన స్థలాల సాధన కోసం ఈ నెల 18న సచివాలయాల వద్దకు లబ్ధిదారులను తీసుకువెళ్లి అర్జీలు అందించాలని చెప్పారు. అనంతరం 13 మందితో సీపీఐ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, నాయకులు జేబీ శ్రీధర్, బత్తుల శామ్యూల్, తుమ్మల పూర్ణచంద్రశేఖర్, సైకం రాజశేఖర్, జె.రత్నకుమారి, నంబూరి సత్యం, బావిరెడ్డి ప్రభాకర్, బక్కా వెంకటరామకృష్ణారెడ్డి,డ కేఎల్‌డి ప్రసాద్, మేకల వెంకాయమ్మ, ఏటగిరి శ్రీనివాసులు, మేకల బిజిలిబాబు, మామిడిబత్తుల అశోక్, మేకల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



జిల్లా పోలీస్ జట్టుకు కప్పు అందజేస్తున్న ఎస్పీ

ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాచ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పోటీల్లో జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేసే పోలీస్ సిబ్బంది జట్టుగా ఏర్పడి పాల్గొన్నారు. ఫైనల్స్‌లో బాపట్ల స్ట్రైకర్స్ వర్సెస్ జిల్లా పోలీస్ టీం తలపడ్డాయి. ఉత్కంఠ పోరులో జిల్లా పోలీస్ టీం విజయం సాధించింది. ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించి ఫైనల్ కప్ గెలుచుకున్న సిబ్బందిని సోమవారం ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇరవై నాలుగుగంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడిని అధిగమించి, మరింత సమర్థంగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, సీసీ హరికృష్ణ పాల్గొన్నారు.

కూచిపూడిలో మద్యం షాపు మూసివేత

టీడీపీ నేతల ఒత్తిళ్లే కారణం ?



అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని కూచిపూడిలో మద్యం షాపును అకస్మాత్తుగా మూసి వేశారు. మండలంలో షాపులు బయట వ్యక్తులు నిర్వహించరాదని తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది నాయకులు దుకాణదారుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపులను నిర్వహించరాదని ఒత్తిడి తీసుకొని వస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో రెండు మద్యం షాపులు బయట వ్యక్తులకు లాటరీ పద్ధతిలో వచ్చాయి. తెలుగుదేశం నాయకులకు రాకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకొని వెళ్లారు. ఒక షాపు నిర్వాహకుడుని బెదిరించి గొట్టిపాటి భాను గంగాధర్ కొనుగోలు చేశారు. రెండో షాపునకు కూడా శనివారం ఎగ్రిమెంట్ అయింది. డబ్బులు చెల్లించక పోవడంతో సోమవారం మూసివేశారు. అమర్తలూరు మండల కేంద్రంలోని రెండు షాపుల్ని ఎమ్మెల్యే కనుసన్నల్లో నడిపించేందుకు తమను బయటకు నెట్టి వేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఎక్సైజ్ నిబంధన ప్రకారం మద్యం షాపు మూసి వేయకూడదు. సమాచారం తెలుసుకున్న సీఐ రవికుమార్ షాపు దగ్గరకు వెళ్లి తెరిపించారు. నిర్వాహకులు గ్యారంటీల కోసం బ్యాంకు చుట్టూ తిరగడం వల్ల మూసి వేసినట్లు ఆయన చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహం

మార్టూరు: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మార్టూరులో జరిగింది. ఎస్ఐ షేక్ సైదా వివరాల మేరకు.. మండలంలోని రాజుపాలెం తూర్పు ఎస్సీ కాలనీకి చెందిన తుమ్మలూరి నాగేశ్వరరావు (47) ఆదివారం రాత్రి స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్ నుంచి గన్నవరం సెంటర్ వైపు మోపెడ్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. రోడ్డు పక్కన పడిపోయిన నాగేశ్వరరావును స్థానికులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగేశ్వరరావు మృతదేహానికి సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శవ పంచనామా చేయించి బంధువులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు మార్టూరుకు చెందిన ఓ వ్యక్తిదిగా పోలీసులు గుర్తించి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పురుగుమందు తాగి వృద్ధుడి బలవన్మరణం

చినగంజాం: పురుగుమందు కలుపుకొని ఓ వృద్ధుడు బలవన్మరణం చెందిన ఘటన చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. చినగంజాం జాతీయ రహదారిపై రొంపేరు కాలువ వంతెన రక్షణ గోడ మధ్యలో ఒక వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. వారందించిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలించారు. సంఘటనా స్థలంలో శీతలపానీయం డబ్బా, చిన్న పురుగుమందు డబ్బా, చిన్న ఫోను పుస్తకం కనుగొన్నారు. వాటిని బట్టి ఆ వృద్ధుడు శీతలపానీయంలో పురుగు మందు కలుపుకొని తాగినట్లు గుర్తించారు. ఫోన్ పుస్తకంలో ఉన్న ఫోన్ నంబర్ల ద్వారా టంగుటూరు మండలం తేటుపురానికి చెందిన వ్యక్తులకు ఫోన్ చేసి అతని వివరాలను కనుగొన్నారు. అతడు తేటుపురానికి చెందిన భవనం వీరారెడ్డి (93)గా గుర్తించారు. అతడు 30 ఏళ్లుగా రొయ్యల చెరువులు దగ్గర పనులు చేస్తూ ఉండేవాడు. వృద్ధుడిగా తన పనులు తాను చేసుకోలేని స్థితిలో అతనిని వారు చీరాల హరిప్రసాద్ నగర్‌లోని కోటయ్య వృద్ధాశ్రమంలో చేర్పించినట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆశ్రమం నిర్వాహకులు పునీత్‌కుమార్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. నాలుగు రోజుల క్రితం అతడు ఆశ్రమం నుంచి వెళ్లిపోయినట్లు ఆశ్రమ నిర్వాహకుడు తెలిపారు. తన వాళ్లు ఎవరూ అండగాలేరనే మనస్తాపంతో వృద్ధుడు చినగంజాం వచ్చి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

- పంగులూరు మండలంలో 18 మంది వీవోఏల తొలగింపు
- వెలుగు కార్యాలయం ముందు నిరవధిక ఆందోళన
- కూటమి నాయకుల సిఫార్సుతో వీవోఏల తొలగింపు
- హైకోర్టు కొనసాగించాలని చెప్పినా వినని అధికారులు



వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు, అధ్యక్షులు, డ్వాక్రా మహిళలు

జే.పంగులూరు: కూటమి ప్రభుత్వం అందినకాడికి దోచుకుందామనే పంథంతో ముందుకెళ్తోంది. కేవలం బెదిరింపులే లక్ష్యంగా ముందుకు సాగుతూ అన్ని శాఖలను భ్రష్టుపట్టిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిరుద్యోగులపై వారి ప్రతాపం చూపుతున్నారు. అందులో భాగంగానే పంగులూరు మండలంలో 18 మంది వీవోఏలను అక్రమంగా తొలగించారని వీవోఏలు, గ్రామ సంఘం, మండల సమైఖ్య అధ్యక్షురాల సోమవారం మండల వెలుగు కార్యాలయం ముందు నిరవధిక ఆందోళనకు దిగారు. వీరికి సంఘీభావంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాయిణి వినోద్‌బాబు, సీఐటీయూ మండల కార్యదర్శి మల్లారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి రామారావు తహసీల్దార్ సింగారావుకు వీవోఏలు, అధ్యక్షులు, డ్వాక్రా మహిళలు వినతి పత్రం అందించారు. బాధితులు మాట్లాడుతూ మాకు న్యాయం జరిగే వరకు 24 గంటలు వెలుగు కారాలయం ఎదుటు ధర్నా చేస్తామన్నారు. మండలంలో 38 మంది వీవోఏలు ఎన్నో సంవత్సరాలుగా వీవోఏలుగా తమ విధులు నిర్వర్తిస్తున్నారు. జీతాలు ఉన్న లేకున్నా చాలా ఏళ్ల నుంచి గ్రామంలో ఉన్న మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవనోపాధులు పెంచేందుకు వీవోఏలు వారి వంతు సాయం అందిస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా వారిని ఎవరూ తొలగించేవారు కాదు. కాని కూటమి ప్రభుత్వం వచ్చిన అతికొద్ది కాలంలోనే గ్రామ ప్రాంతంలో పనిచేస్తున్న 18 మంది వీవోఏలను నిర్దాక్షిణ్యంగా ఎలాంటి సమాచం లేకుండా, గ్రూపు సభ్యుల తీర్మానాలు లేకుండా, వారి ఫోర్జరీ సంతకాలు చేసుకొని అక్రమంగా తొలగించారని వీవోఏలు ఆవేదన చెందుతున్నారు.

తొలగించడం మంచి పద్ధతి కాదు



ఏ పార్టీ అధికారంలోకి వస్తే వారికి సంబంధించిన వారిని పెట్టుకోవడం మంచిది కాదు. డ్వాక్రా సంఘాల మీద రాజకీయం పనికిరాదు. ఎప్పటి నుంచో జీతం లేకుండా పనిచేసే వారిపై ఇప్పుడు జీతం వస్తుందని వారిని తొలగించడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి చిరుద్యోగులపై దాడులు ఎక్కువయ్యాయి.. ఇప్పటికైన తొలగించిన 18 మంది వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి.

– రాయిణి కృష్ణకుమారి, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు

రాత్రిళ్లు వచ్చి భయపెడుతున్నారు



మా గ్రామంలో 2009లో 10 మంది సభ్యులం కలిసి మైసమ్మ డ్వాక్రా గ్రూపు ఏర్పాటు చేసుకున్నాం. నేను అప్పటి నుంచి గ్రామైఖ్య సంఘానికి కార్యదర్శిగా పనిచేస్తున్నాను. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా దాక వచ్చేవారు కాదు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి నెలలోనే గ్రామంలో రాత్రి సమయాల్లో మా ఇళ్ల వద్దకు వచ్చి.. మేము చెప్పిన వారిని నియమించకుంటే మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. మా సంతకం లేకుండా మమ్మల్ని గ్రామ సంఘం నుంచి తొలగించి కొత్తవారిని నియమించారు.

– వాసుపల్లి శ్రీలత, కొండమూరు గ్రామసమైఖ్య కార్యదర్శి

ఉపాధి హామీ ఏపీఓపై కత్తితో దాడి

- టెక్నికల్ అసిస్టెంట్ దురాగతం
- దాడిలో కంప్యూటర్ ఆపరేటర్‌కి గాయాలు



దాడిలో గాయపడిన ఏపీఓ బుల్లయ్య



కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్

పర్చూరు (చినగంజాం): విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఉపాధి హామీ ఏపీఓపై టెక్నికల్ అసిస్టెంట్ కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన పర్చూరులో ఉపాధి హామీ కార్యాలయంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో జీతాల బిల్లుల విషయంలో ఏపీఓ బుల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్ర మధ్య చెలరేగిన వివాదం దాడికి దారి తీసింది. భోజన విరామ సమయంలో ఇద్దరి మధ్యా వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో కోపోద్రిక్తుడైన టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్ర ఒక్కసారిగా ముందస్తు పథకం ప్రకారం తన వెంట తెచ్చుకున్న కత్తితో ఏపీఓపై దాడికి పాల్పడ్డాడు. ముందుగా అతని మెడపై బలంగా కొట్టి కత్తితో దాడి చేయబోయాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనలో ఖాదర్‌కు ముఖంపై కత్తి గాయమైంది. దాంతో రాజేంద్ర కత్తిని అక్కడే పడేసి వెంటనే పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్రను పోలీసులు విచారిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నామని పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.